# సంధియుగపు సమస్య



పరీక్షలైయింటికి వచ్చిన వారం రోజులనుంచీ నా పెళ్ళిమాటలే వింటున్నాను. ప్రత్యేకం నన్ను పిలిచి ఏమీ అనకపోయినా, అడక్కపోయినా నే వినేటట్టుగా, మా వాళ్ళంతా ఆ విషయం ప్రసంగించడ మారంభించారు. నే వచ్చిన రోజు రాత్రే, భోజనాల దగ్గిర, మా బామ్మ, "ఏంరా నాయనా, చదువుకోవాలంటూ ఇన్నాళ్లూ గడిపేశావు. బి. ఏ. కన్నా పెద్ద పరీక్షకూడా అయిపోయిందిట, ఇంకైనా పెళ్ళి చెయ్యవుట్రా? ఈ యీడుకు నే ముగ్గురు బిడ్డల తల్లి నయ్యాను" అని, పల్లని ఎత్తుకుంది.

"అవునండీ, అత్తగారన్నమాట నిజం. చదువయిపోయింది. ఇంక గట్టిగా పెళ్ళి ప్రయత్నం చెయ్యాలండీ. కాలాన్ని బట్టి ఇన్నాళ్లు పెరగనిచ్చాము గాని, లేకపోతే ఏనాడో పెళ్ళిగావలసిందేగాదండీ!" అని, మరో పది నిముషాల తర్వాత, తమలపాకు లందిస్తూ, మా అమ్మ అను పల్లవి అందుకుంది.

"ఏం? మనం ప్రయత్నించకపోతే పెళ్ళి గాదా?" అన్నారు మా నాన్నగారు, నవ్వుతూ.

"చాల్లెండి దేనిలో లేకపోయినా, వేదాంత మంతా దీనిలో చూపిద్దురు గాని. అమ్మ కూర్చకపోతే బ్రహ్మకూడా కూర్చడట! మనం ప్రయత్నం చెయ్యకపోతే ఎలాగ? అపైన దాని పుణ్యం."

"సరే, మళ్లీ దాని పుణ్యమంటూ, ఒక హింసపాదుంది గదా! ...... అయినా, జ్ఞానం వచ్చిన పిల్ల, దాని ఇష్టాయిష్టాలు తెలుసుకో వద్దూ?"

"బాగానే వుంది. రెండు పరీక్షలు అవగానే మహాజ్ఞానం వచ్చేసిందిలెండి! అయినా, దాన్నడగొద్దని ఎవరన్నారు? పెళ్ళి చూపులు లేకుండా ముడిబెట్టమని మేమేం అనడం లేదు."

"అయితే, ఒక మాటు పెళ్ళి చూపుల లాంఛనం జరిపితే,-సమస్యలూ, అన్నీ తీరిపోయి ఒక నిశ్చయానికి రాగలదన్నమాట!"

"ఏమో. తీరుతాయో తీరవో, నా కదంతా తెలియదు - అసలామాటకు వస్తే, మా కే సందేహాలూ రాలేదు! సమస్యలున్నాయనే తెలియదు. ఏమన్నా సరేగాని ఇవన్నీ ఇన్నేసి ఏళ్లు పెంచితేనే వస్తాయి - ఇంతకీ - ఎన్నేళ్లు పెంచినా ఎప్పుడో ఒకప్పుడు మనం పెళ్ళిచేయవలసిందేనా లేక దాని మొగుణ్ణి వెతుక్కుంటూ, అది ఊళ్లంట బయలుదేరాలంటారా?"

"అదేం బయలుదేరక్కరలేదు. దాన్ని వెతుక్కుంటూ వాడే వస్తాడు. పురుషుడికి పెళ్లాం మరీ అవసరం!"

"మంచిమాటలే, ఎవరేనావింటే నవ్వుతారు. ఏదో, సరదా తీరా చదివించాం. ఇంకా, ఊరుకోవడం ధర్మంగాదు సుమండీ. ఇలాగే అశ్రద్ధచేస్తే ఏ పంతులమ్మ ఉద్యోగంచేస్తూనో బ్రతకాలిసొస్తుంది. చప్పున, ఉన్న వాళ్లలో ఎవరికో ఒకరికి స్థిరపరచండి. క్రొత్తగా పుట్టే వాళ్లకియ్యంగదా!"

"భేషుగ్గా వుంది నీ సలహా! పంతులమ్మ ఉద్యోగం రాకుండా పెళ్ళాం ఉద్యోగంలో చప్పున చేర్పించాలంటావు. అదీ, మనమే చెయ్యాలంటావు. అంతేనా? సరేలే. నీ మాట

వి. కె. మణి

కాదని చిన్నబుచ్చటమెందుకు? ఇవన్నీ అమ్మాయితో చెపుతాను. పెళ్ళికొడుకుల జాబితా ఇస్తాను. ఆ పైన దాని యిష్టం."

చివరికి నిన్న రాత్రి మా నాన్నగారు నన్ను దగ్గరగా పిలిచి చెప్పదలచిన నాలుగు మాటలూ చెప్పి పెళ్ళి కొడుకుల చిత్తాఇచ్చి, నీ ఇష్టం తెలియ జెయ్యడం' అన్నారు.

*    *    *

పెళ్ళి మాటలు విన్నప్పుడల్లా, సంతోషమో భయమోగాని, (బహుశా రెండూనేమో!) నా గుండెలు ఝల్లు మంటూనే వుంటాయి.

నే నెవ్వరినీ ఇంతవరకూ ప్రేమించ లేదు. కాని, ప్రేమనుగురించీ, పెళ్ళిని గురించీ, తియ్యటి కలలూ, ఘాటైన ఆలోచనలూ లేకుండా లేను.

పెళ్ళంటే ఏమిటి? ప్రేమంటే ఏమిటి? పెళ్ళికీ-ప్రేమకూ సంబంధ ముందా? పెళ్ళి కావాలా వద్దా? పెళ్ళి పెద్దలు చెయ్యాలా? ప్రేమించి లామే పెళ్ళాడాలా? ప్రేమకు స్థిరత్వ ముందా? విడాకు లేయే పరిస్థితులలో వుండాలి? ఇత్యాది వెన్నెన్నో ప్రశ్న పరంపరలు నా మనసుని కలవరపెట్టేస్తూ వుంటాయి.

మొన్న, మా చిన్న తమ్ముడూ చెల్లెలూ, మా నాన్నగారి కాఫీకప్పుకోసమని పెనగులాడుతున్నారు. వాడు చుర్రుమని దాన్నొక్క టంటించినట్టున్నాడు. అది, ఏడుస్తూ, 'నన్ను కొడతావా? ఉండు. 'అమ్మతో చెప్పి నీ పెళ్ళి చేయించకపోతానా!' అని బెదిరించింది. ఆ లాగులాటలో, ఇద్దరి చేతుల్లోనించి పట్టుదప్పి క్రిందపడి, కప్పు ముక్కలయిపోయింది. అంతలో మా అమ్మ వచ్చి, అయ్యయ్యో, ఆ కప్పు పెళ్ళయిందీ? అది తియ్యవద్దంటే వినరుగదా. ఇలా మాటలతో చెపితే మీరువినరు!' అని ఇద్దరికీ చెరి రెండు బహుమతులూ ఇచ్చి సాగనంపింది.

నిన్న మా పాప, వద్దంటే వినకుండా కొళాయి దగ్గిర ఆడుతూ, జర్రున జారిపడింది. గౌనంతా బాడైంది. అరున్నొకటో రాగం, ఆకాశమంటేలాగ అరంభించింది.

'అయిందా పెళ్ళి? ఒద్దే అమ్మా అంటే విన్నావా? పెంకితనం చేస్తే ఏమవుతుంది మరి?' అంటూ మా అమ్మమ్మ పెళ్ళి, లేవదీసి, అంటుకున్న బాడి కడిగి తీసుకువచ్చింది.

ఆ మధ్య నా స్నేహితురాలు సరళని రాత్రి సినిమాకు రమ్మంటే, 'ఇంగ్లీషు టెస్టు' చదవకుండా మీతో ఇప్పుడు సినిమాకు వస్తే, రేపు నాకు పెళ్ళి తప్పదు. పెద్దబండి సున్నా 'ప్రెజెంటు' ఇస్తారు. నే రాను బాబూ' అన్నది.

పెళ్ళి అంటే శిక్షా? బ్రతుకా ఖరవడమా? పెంకితనానికి ప్రాయశ్చిత్తమా? సర్వశూన్యమా? అమ్మయ్యో! అలాగైతే నాకు వద్దు.

ఆబాలగోపాలం, అప్రయత్నంగా ఆడే ఈ అలవాటు మాటకు విలువే లేదా? తగినంత కారణం లేనిదే వాడుకలోని కొస్తుందా? ఎన్నటికీ రాదు. ప్రస్తుతం పెళ్ళంటే అంతే.

బాజాభజంత్రీలతో, విందు వినోదాలతో, కన్యాప్రదాత కొంచెమించుమించు దివాలాతో, పదిమంది పెద్దలూ చేరి ఉపాధ్యాయులవారూపిరాడకుండా ఉచ్చరించే మంత్రాలతో సర్వ భక్షకుడైన అగ్నిహోత్రుడి సాక్షిగా, ఒక యువకునికి ఒక యువతి దాన మివ్వించబడడం! ఈ అన్యాయానికి అగ్నిహోత్రుడలిగి ధుమధుమలాడడం గాబోలు ధూమ రేఖలలుముకుంటాయి. పగబట్టినట్టు వచ్చే ఆ పొగతో ఉక్కిరిబిక్కిరవుతూ, కళ్ళ నీళ్లు గారుస్తారు కన్యావరులు. భావిసూచనా? వధువు వయసు ఏదిమిదైనా పద్ధెనిమిదైనా, పద్ధతంతా ఒక్కటే. ఒకరినొకరెరుగని ఇరువురు స్త్రీపురుషులు అజన్మాంతం కలిసి జీవయాత్రసాగించమని విప్పరాని ముడితో బంధించబడతారు! అదీ పెళ్ళి అంటే ఇప్పుడు!

ఓ! అది జరుగుతూన్నంత సేపూ చూడడానికి ముచ్చటగా ఉంటుంది. ఇంక ఆ తరువాతా? నూటికి తొంభై మందికి తెలిసిన విషయం వేరే చెప్పేదేమిటి?

(అథం శుభం ఎరగని, ఇద్దరు అమాయిక ప్రాణుల నలాగ కట్టిపెట్టి శిక్షించడం దేనికో గదా? అన్నట్టు అదికూడా మన హిందూమత ధర్మమేనేమో! బాధ పడుతూనే బ్రతకాలి. మనం స్వేచ్ఛగా సుఖపడవలసింది చచ్చాక స్వర్గంలోనే!!)

ఇక, ఆ పెళ్ళితో, తామెంచుకోపోయినా, ఒకరిపై నొకరికి అజన్మాంతం తొలగిపోని అధికారాలు కలుగుతున్నాయి. ఆ ధీమాతో, భర్తను రంజింప చెయ్యవలసిన అవసరము భార్యకూ,-

భార్యను లాలించాలనే భావము భర్తకూ అపురూపంగాఉన్నాయంటే అతిశయోక్తి అవుతుందా

అవును. ప్రేమించి పెళ్ళాడాలని చాలామంది అంగీకరిస్తున్నారు. (మాటల్లో!) వివాహ విధానాలలో చాలామార్పులు వచ్చాయి. (ప్రేమించి నామన్న వారు.) వర్ణాంతర విభేదం కూడా లేకుండా పెండ్లాడడానికి అనువుగా, రిజిస్ట్రేషను వివాహాలూ, దుర్భర పరిస్థితులలో కాదు, కొన్ని పరిస్థితుల్లో, వదలించుకునుకు వీలుగా విడాకులూ, బహుభార్యా నిషేధమూ, వచ్చిన మాట నిజమేగాని, అవన్నీ పద్ధతి మార్పు, పైపై మాటల మెరుగులేకాని, ప్రయోజనంలో, పరిణామంలో ముప్పాతిక వంతు నిరుపయోగంగానే ఉంటున్నాయి. దేశంలోని ఆర్థిక విధానమూ, సంఘ దృక్పథమూ, అభ్యుదయకరంగా మార్పు చెందితేనేగాని, పెండ్లిలో సుఖములేదు! ఆ రెండూ మారిననాడు, పెండ్లి ఒక పెద్ద సమస్యే కాదు.

నిజమే. మా అమ్మ అన్నమాట నిజమే. ఇప్పటి మన సంఘ వ్యవస్థలో పెద్దలు కూర్చకపోతే, పెళ్ళయ్యే దెలాగ? యువతీ యువకులు కలిసి మెలసి మాట్లాడుకోవడమే మహావేగంగా భావించబడే సంఘంలో, ఒకరి నొకరు తెలుసుకుని ప్రేమించడాని కేమవకాశాలున్నాయి? అప్పుడు, అక్కడక్కడ చూపులలో కలిగిన ఆకర్షణ ప్రేమమో, మోహమో తెలుసుకొనే దెలాగ? అవి సౌఖ్యకరంగా నిలుస్తాయని నిశ్చయ మేముంది? మొదట వెల్లువలై పారిన మోహము కొన్నాళ్ళ కదృశ్యమైపోతే! ప్రేమ తరిగి పోయిందన్న కారణానికి విడాకులిస్తారా? (లేనిపోని బురదత్రొక్కి, కోర్టులో కాళ్లు కడుక్కుని సంకెళ్లు విదల్చుకోవాలి!)

బహుభార్యా నిషేధం చూసి మాత్రం పొంగి పోవడ మెలాగ? ప్రేమ పోకడలకు, నియమాలూ, నిబంధనలూ అడ్డు నిలవ గలవా? పెండ్లయిన వానివైపు మనసు పోరాదంటే మానుతుందా? ఇదివరకులేని కొత్త సమస్యలనూ బాధలనూ బలిమిని పైన పడవేయడమే అది. సమర్థించకలిగిన ప్రజ్ఞ పతికీ, సర్దుకో గలిగిన ప్రేమ సతులకి ఉన్నప్పుడు, వద్దనడానికి వీధి వారెవరు? ఎవడో ఒక వాజెమ్మని తప్పనిసరిగా కట్టుకునే దానికన్నా, ప్రతిభావంతునితో పదవ పాలైనా వాంఛనీయమే! ఈ పరిస్థితులలో ప్రేమించిన వాడిని పెండ్లాడడ మెలాగ? అంతే గాదు. పెళ్ళైడినతర్వాత, గృహనిర్వాహకత్వమే, జీవనాధారమైన వృత్తిగా స్వీకరించిన స్త్రీ ఆర్థికంగా సమర్థుడైన వాని నెంచుకో వలసిందేగాని ప్రేమకు ప్రాధాన్య మియ్యడ మెలాగ?

విద్య నేర్చి, తాను ఉద్యోగము చేసుకుంటూ వుండి, ప్రేమించిన వాడినే పెళ్లాడకూడదా? అనుకుందామంటే, - ఇద్దరికీ ఒక ఊరిలోనే ఉద్యోగముంటుందని నిశ్చయముందా? ఎవరి కష్టసుఖములు వారివిగా, చెరియొక ఊళ్లో ఉంటే ఏడాదికోనాడు కలిసికొనే వారి జీవితంలో, భార్యాభర్తల సౌఖ్యమూ, సంపూర్ణ సహచర్యమూ ఎలాగుంటుంది? అదలాగుండగా, ఇరువురూ బయట ఉద్యోగాలు చేసితే, గృహనిర్వాహకత్వ మెవరివంతు? పెండ్లిచేసుకున్న స్త్రీకి, ఇల్లు దిద్దడం, బయట ఉద్యోగం చెయ్యడం, రెండూ ఎలాగ సాధ్య మవుతాయి? అయినా పురుషునితో సమానంగా శ్రమపడి ఉద్యోగంచేసే స్త్రీ, అదనంగా, గృహనిర్వాహకత్వ భారంకూడా ఎందుకు వహించాలి?

అయితే, - స్త్రీ, చదువుకుని ఉద్యోగం చెయ్యడమా? పెళ్లాడి ఇల్లుదిద్దడమా? - ఆర్థిక స్వాతంత్ర్యంతో స్వేచ్ఛగా బ్రతకాలంటే, ఒంటరిగా ఉండి ఉద్యోగం చెయ్యాలి; కాని, జీవితం సంపూర్ణం కావాలంటే, సహచర్యం లేకపోతే ఎలాగ? ఒకటే సమస్య!

ఎంత చదువుకున్నా, బయటి ఉద్యోగంకాని ఇంటిపనినే చెయ్యవలసివస్తే, అది, భత్యమే కాని జీతంలేని నౌకరీ అయిపోతూవుంటోంది. విద్యా విశేషాలుకల * వనితలకది అన్యాయం కాదూ? పోనీ, ఏ సఫ్రగెట్టే ఉద్యమంలాగో భార్యలకు జీతం ఏర్పాటుచెయ్యాలని ఓ ఆందోళన ప్రారంభిద్దామన్నా-అదీ సులభంగా పరిష్కారమయ్యేది కాదు. కళాశీలుల్లాగే, భార్యలూ రకరకాలు. ఒకటేరేటున వారి విలువలు నిర్ణయించ లేము.

ఏమో. ఇదంతా ఆలోచిస్తూవుంటే తల తిరిగి, ఉన్నమతీ పోతోంది. ఇంతకీ, ముఖ్యంగా నేనిప్పుడు నిశ్చయించుకోవలసింది, పెళ్ళి కావాలా? వద్దా?

వద్దు. కావాలి. అంటాను!

పురాతనాభిప్రాయాలతో, పాతపద్ధతిలో, ఇప్పటికింకా అమలు జరుగుతూన్న ఒకరు చేసే పెళ్ళి వద్దు. ప్రస్తుతకాలానుగుణంగా, నూతనాశయాలతో నిర్మించుకోవలసిన పెళ్ళి కావాలి.

ఒకరికొకరు లేసి జీవితం సవ్యంగా తోచచమే, నీవు నేననే భేదం తోచకపోవడమే ప్రేమ.

అనురాగాన్వితులైన స్త్రీపురుషు లిద్దరికీ ఆత్మసంతృప్తినిచ్చే సంపూర్ణ సహచర్యమే అసలైన పెళ్ళి!

అటువంటప్పుడే సందేహాలూ, సమస్యలూ రావు. ఆ ఉద్వేగ ప్రేమావేశంలో మునిగి పరవశమై ఉన్నప్పుడు ఆలోచనలే లేకుండా పెళ్ళాడి,- ఆపైన కలిగే సమస్యల్ని ఎప్పటికప్పుడే దిద్దుకోవలసిందే గాని, ఊరికే తీరికూచుని ఆలోచించి, ఆలోచించి విధి కర్మమూ అనుకుని లోతునీటిలో దిగడమెందుకు? ఎప్పుడైనా, అటువంటి మధురానుభూతి కలిగితే, వెనుకముందులు చూడకుండా, ఆ మహాసాగరంలోని ఉరికి తీరవలసిందే!

ఈ మాటే చెబుతాను మా నాన్నగారితో!



"జీవితము" తెలుగు చిత్రంలో అభినేత్రి వైజయంతీమాల.